# కాబోయే రాష్ట్రపతి!? - SKU



<u>భైరాన్ సింగ్ షెఖావత్</u>: ప్రస్తుత ఉప రాష్ట్రపతి ఈయన. BJP తరపున గెలిచిన వ్యక్తి. రాజస్తాన్ లో కాంగ్రెస్ కోటకి బీటలు వేసిన ఘనుడు. లెఫ్ట్ పార్టీలకి ఈయన నచ్చరు. కనుక ఎంత తనకి రాష్ట్రపతి పదవి మీద మక్కువ వుంది అని ఈయన బాహాటంగా ప్రకటించినా, BJP కూడా ఈయన అభ్యర్ధిత్వాన్ని పూర్తిగా సమర్ధించకపోవచ్చు. రాష్ట్రపతి అయ్యే అవకాశాలు తక్కువ.

<u>అబ్దుల్ కలాం</u>: ఈయన మొదటి దఫా రాష్ట్రపతి గా ఎన్నిక అవటం బోలెడంత డ్రామా అనంతరం జరిగింది. అప్పటి అధికార పార్టీ NDA PC అలెగ్జాండర్ ని కానీ అప్పటి ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్ ని కానీ తమ అభ్యర్ధి అని సూచనప్రాయం గా చెప్పిన వెంటనే కాంగ్రెస్ మాకు ఇద్దరూ సరిపడరు.. మీరు వాళ్ళలో ఒకరిని ప్రతిపాదిస్తే మేము ప్రస్తుత (అప్పటి) రాష్ట్రపతి నారాయణన్ నే నిలబెడతాం అని ఖచ్చితం గా చెప్పారు. దానితో మైనారిటీ కి చెందిన ఎవ్వరికీ అభ్యంతరం లేని అబ్దుల్ కలాం ని ఎన్నుకోక తప్పలేదు BJP కి. కాంగ్రెస్ కూడ ఇంక వంక పెట్ట వీలు లేక ఆయననే బలపరిచింది. మరి ఇప్పుడు కాంగ్రెస్ అధికారం లో వుంది. ఎంత అప్పట్లో బలపరిచిన అభ్యర్ధి అయినప్పటికీ కలాం ఎప్పటికీ తమ ప్రత్యర్ధి తాలూకా మనిషే. కనుక కాంగ్రెస్ మరోసారి ఆయననే బలపరిచే పరిస్థితి కొంచెం తక్కువే అయినా ప్రస్తుత పరిస్థితిలో అదే జరొగచ్చు.

<u>ప్రణబ్ ముఖర్జీ</u>: కాంగ్రెస్ పార్టీ లో రాజీవ్ హత్య, PV పతనం దరిమిలా తనకి పార్టీ పగ్గాలు వస్తాయి అని ఆశపడిన వ్యక్తులలో ప్రణబ్ ముఖర్జీ ఒకరు. లెక్కలు, వివరాలు ఏ కంప్యూటరూ, కాలిక్యులేటరూ అవసరం లేకుండా నోటితో అలవోకగా అప్పచెప్పగల మేధావి. లెఫ్ట్ పార్టీలు సోమనాధ్ ముఖర్జీ కాకపోతే మా సపోర్ట్ ప్రణబ్ ముఖర్జీ కే అని ఇప్పటికే బాహాటంగా ప్రకటించాయి. కానీ కాంగ్రెస్ లో అంత ఉత్సాహం కనిపించటం లేదు ఈయన అభ్యర్ధిత్వం గురించి. అలాగే పార్టీ పగ్గాలు కానీ, ప్రధాని పదవి కానీ ఆశిస్తున్న ప్రణబ్ అలంకార ప్రాయమైన రాష్ట్రపతి పదవి తో సంతృప్తి పడతారంటే నమ్మటం కొంచెం కష్టమే!

<u>సోమనాధ్ చటర్జీ</u>: మోడర్న్ ఉక్కు మనిషి గా ఈయనని చెప్పొచ్చు. లంచాలు తీసుకున్న ఆరోపణలలో ఇరుక్కున పదకొండు మంది MP లని లోక్ సభ నుండి బహిష్కరించిన విషయం లో డిల్లీ హైకోర్ట్ లోక్ సభ స్పీకర్ కి సమన్లు పంపితే నన్ను పిలవటానికి నీకున్న అధికారమేమిటి అని కోర్ట్ నే హుంకరించిన ఘనుడు సోమనాధ్ చటర్జీ. ఈయన కూడా తనకి రాష్ట్రపతి పదవి మీద మోజు వుంది అని సూచనప్రాయం గా రెండుమూడు సార్లు చెప్పారు. ఒకప్పుడు పశ్చిమబెంగాల్ లో చక్రం తిప్పినప్పటికీ ప్రస్తుతం అక్కడ ఈయన మాటలు వినే వాళ్ళు లేరు.. కనుక రాష్ట్రపతి గా కొంత విశ్రాంతి తీసుకుందామని చూస్తున్నారేమో. అయన్ అభ్యర్ధిత్వాన్ని కాంగ్రెస్ సమర్ధించకపోవచ్చు. BJP సమర్ధన సమస్యే లేదు. కనుక ఈయన రాష్ట్రపతి అయ్యే అవకాశం కొంచెం తక్కువే. అయితే మాత్రం ప్రభుత్వం చేతిలో రబ్బర్ స్టాంప్ లాంటి రాష్ట్రపతి గా మిగిలే అవకాశం అస్సలు లేదు. మనకి రోజూ బోలెడు వార్తలే వార్తలు!

<u>అటల్ బిహారీ వాజ్ పేయ్</u>: పెద్దాయన కి ఓ రోజు రాజకీయాల నుండి తప్పుకోవాలని అనిపిస్తుంది. మరో రోజు ఆ ఆలోచన కేవలం చిన్న జోక్ అంతే అనిపిస్తుంది. రాజకీయం గా అపారమైన

అనుభవం వునప్పటికీ ప్రస్తుతం BJP లోనే ఆయన మాట వినేవాళ్ళు తక్కువ. కాంగ్రెస్ మీద పంతానికి పోటీ అభ్యర్థిని నిలపాల్సిన అవసరం BJP కి వస్తే ఈయన వారి అభ్యర్థి అవ్వచ్చు. ఆ విధంగా రేపు రాబోయే లోక్ సభ ఎన్నికలలో BJP గెలిస్తే ఒక ప్రధాని పదవి పోటీదారు తగ్గుతారు!

**నారాయణ మూర్తి**: ఈయన పేరు ఆ మధ్య ఒకసారి వినిపించింది. కానీ, జాతీయ గీతం గురించి అమర్యాదకరంగా ఈయన చేసి నాలిక కరుచుకున్న వ్యాఖ్యల దరిమిలా ఈయనని బాహాటంగా సమర్థించే పార్టీ వుండకపోవచ్చు. గొప్ప కోసం మన చంద్రబాబు నేనూ ఒకరిని నిలబెడతాను అన్నట్టు ఏమన్నా SP, AIADMK లాంటి ప్రాంతీయ పార్టీలతో కలిసి నిలిపే అవకాశాలు వున్నాయి. ఒకవేళ ఈయన అభ్యర్థిగా నిలబడ్డా గెలిచే అవకాశాలు మృగ్యం.

---

మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి